క్లుప్తంగా

అంకమ్మతల్లి ఆలయ నిర్మాణానికి విరాళం



ఎమ్మెల్యే సమక్షంలో విరాళం అందజేస్తున్న దాతలు

కందుకూరు అర్బన్: కందుకూరు పట్టణ గ్రామ దేవత శ్రీ అంకమ్మతల్లి దేవాలయం పునఃనిర్మాణానికి స్థానిక వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో ఎమ్మెల్యే మానుగుంట మహీధర్ రెడ్డి సమక్షంలో కేవీ. భాస్కర్ ధర్మపత్ని పద్మావతి, కుమారుడు అనంతకృష్ణ, కోడలు కౌస్యల రూ.30,295లను విరాళంగా కమిటీ సభ్యుడు వెంకటరెడ్డికి అందజేశారు. అలాగే అమ్మవారి పాదాల చెంత బంగారు యంత్రం ప్రతిష్టకు రూ.5,716 నగదును సమర్పించారు.

అన్యాయాన్ని ఎదిరించడంలో ముందుండాలి

కందుకూరు అర్బన్: రాష్ట్రంలో ఏపీడీఆర్‌ఎఫ్ సభ్యులు అన్యాయాన్ని ఎదిరించడంలో ముందుండాలని ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ సంక్షేమ సంఘం వ్యవస్థాపకుడు గుంటగాని పేతురు పిలుపునిచ్చారు. మంగళవారం కందుకూరు పట్టణంలోని కందుకూరు డివిజన్ అధ్యక్షుడు రేనామాల అయ్యన్న అధ్యక్షతన ఏపీడీఆర్‌ఎఫ్ సభ్యుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రకాశం జిల్లా మైనార్టీ అధ్యక్షునిగా సయ్యద్ ఆసిఫ్ ఉద్దీన్, కందుకూరు టౌన్ మైనార్టీ అధ్యక్షునిగా ఎస్‌కె.అమీర్‌ను నియమించారు. కార్యక్రమంలో కె.మాధవరావు, పి.యల్లమంద, ఎం.అచ్చమ్మ, బిరుదల సంధ్యారాణి, పి.నరసింహ, బి.సుశీల తదితరులు పాల్గొన్నారు.

చిరుధాన్యాలపై రైతులకు అవగాహన

కందుకూరు రూరల్: ఐక్యరాజ్యసమితి 2023 సంవత్సరాన్ని అంతర్జాతీయ చిరుధాన్యాల సంవత్సరంగా ప్రకటించిన సందర్భంగా చిరుధాన్యాల సాగు ప్రాముఖ్యతపై ఆనందపురం ఆర్బీకే రైతులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి హాజరైన ఏడీఏ ఎం.శేషగిరి మాట్లాడుతూ ఆనందపురం ఆర్బీకే పరిధిలో ఇప్పటి వరకు 400 ఎకరాల వరకు జొన్న సాగు చేసినట్లు తెలిపారు. అనంతరం చిరుధాన్యాల ప్రాముఖ్యతలను తెలిపే ర్యాలీ నిర్వహించి జొన్న పంటలను పరిశీలించారు. కార్యక్రమంలో సీటీఆర్ఐ, కేవీకే, ఏపీసీఎన్‌ఎఫ్, ఆర్బీకే సిబ్బంది పాల్గొన్నారు.

ఆర్థిక అక్షరాస్యతతో కుటుంబాభివృద్ధి

ఉలవపాడు: ఆర్థిక అక్షరాస్యత వలన కుటుంబం అభివృద్ధి చెందుతుందని ఆంధ్రప్రగతి గ్రామీణ బ్యాంకు మేనేజర్ వి.ఫణీంద్ర అన్నారు. స్థానిక కరేడు పంచాయతీ పరిధిలోని మర్రిచెట్టు సంఘంలోని ప్రజలకు మంగళవారం అవగాహన కల్పించారు. ప్రజలు ఆర్థికంగా ఎలా స్థిరపడాలి అనే అవగాహన కలిగి ఉండాలన్నారు. అన్ని బ్యాంకుల కన్నా అధికంగా 7.8 శాతం వడ్డీ ఖాతాదారులకు అందిస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో ఫీల్డ్ ఆఫీసర్ పద్మావతి తదితరులు పాల్గొన్నారు.

రీ సర్వేకు రైతులు సహకరించాలి

ఉలవపాడు: వైఎస్సార్ జగనన్న శాశ్వత భూహక్కు భూరక్ష పథకంలో భాగంగా జరుగు రీ సర్వే లో రైతులు సహకరించాలని తహశీల్దార్ మహ్మద్ హుసేన్ కోరారు. మంగళవారం మండల పరిధిలోని బద్దిపూడి గ్రామంలో నిర్వహించిన గ్రామసభలో ఆయన పాల్గొని మాట్లాడారు. రేషన్‌కార్డు, బ్యాంకు ఖాతా, 2 పాస్ పోర్టుసైజు ఫొటోలు, శిస్తు రశీదులను అందచేయాలని కోరారు. కార్యక్రమంలో వీఆర్వో పీరయ్య పాల్గొన్నారు.

ఉత్తమ వీఆర్వోకు సన్మానం

కనిగిరి రూరల్: ఉత్తమ వీఆర్వోగా ప్రశంస పత్రం అందుకున్న శ్రీకాంత్‌రెడ్డిని మంగళవారం స్థానిక ఐదో సచివాలయంలో మున్సిపల్ చైర్మన్ గఫార్, సచివాలయ అధికారులు ఘనంగా సన్మానించారు. అడ్మిన్ అబ్దుల్ మజీద్, వైఎస్సార్ సీపీ నాయకులు, వలంటీర్లు పాల్గొన్నారు.

పురుగు మందులు అధికంగా వాడొద్దు

కొండపి: పంటలకు తగిన మోతాదులో పురుగు మందులు పిచికారీ చేసుకోవాలని సింగరాయకొండ సబ్ డివిజన్ వ్యవసాయ సహాయ సంచాలకులు ఈ.నిర్మలకుమారి రైతులకు సూచించారు. మండలంలోని అనకర్లపూడి గ్రామంలో మంగళవారం వీఏఏ భరత్‌కుమార్ ఆధ్వర్యంలో పొలంబడి కార్యక్రమం నిర్వహించారు. ఏడీఏ మాట్లాడుతూ.. శనగలో ఎరపంటగా బంతి మొక్కలు, కంచె పంటగా మేతజొన్న వేసుకోవాలని సూచించారు. శత్రు, మిత్ర పురుగులను గమనించి అవసరంమేర పురుగు మందులు పిచికారీ చేయాలని తెలిపారు. భూసార పరీక్షల్లో సూచించిన ఎరువులను మోతాదు మేర వాడుకోవాలన్నారు. ఈ క్రాప్ చేయించుకున్న రైతులకే సున్నా వడ్డీ పంట రుణాలు, పంట నష్టపరిహారం వర్తిస్తాయన్నారు. కార్యక్రమంలో ఏఈఓ రాము, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది పాల్గొన్నారు.

పట్టణాభివృద్ధే లక్ష్యంగా పాలన

- కనిగిరి మున్సిపల్ చైర్మన్ అబ్దుల్‌గఫార్



సమావేశంలో మాట్లాడుతున్న మున్సిపల్ చైర్మన్ అబ్దుల్ గఫార్

కనిగిరి రూరల్: పట్టణాభివృద్ధే లక్ష్యంగా ఎమ్మెల్యే బుర్రా మధుసూదన్‌యాదవ్ సహకారంతో మున్సిపల్ పాలకమండలి పనిచేస్తోందని మున్సిపల్ చైర్మన్ ఎస్‌కే అబ్దుల్ గఫార్ అన్నారు. స్థానిక సమావేశ మందిరంలో మంగళవారం మున్సిపల్ చైర్మన్ అధ్యక్షతన పాలకమండలి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మున్సిపల్ చైర్మన్ గఫార్ మాట్లాడుతూ గత ప్రభుత్వంలో మున్సిపల్ పాలకులు దోచుకోవడమే పనిగా పరిపాలన చేశారని విమర్శించారు. ప్రస్తుతం ఎంతో నీతి, నిజాయితీగా పరిపాలన సాగిస్తున్నామన్నారు. ప్రతి రోజూ తాను, కౌన్సిలర్లు వార్డుల్లో తిరిగి సమస్యలు తెలుసుకుని సాధ్యమైనంత వరకు పరిష్కరిస్తున్నట్లు చెప్పారు. ఇప్పటికే పట్టణంలో 100 విద్యుత్ స్తంభాలు కొత్తవి మంజూరు చేసి పనులు జరుగుతున్నట్లు వెల్లడించారు. కొన్ని పత్రికల్లో కావాలని మున్సిపాలిటీపై, అధికార పార్టీపై బురదజల్లే విధంగా అసత్య వార్తలు రాయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నట్లు చెప్పారు. మున్సిపల్ శానిటరీ ఇన్‌స్పెక్టర్‌పై వచ్చిన ఆరోపణలపై లిఖిత పూర్వక ఫిర్యాదులు చేస్తే విచారించి చట్టరీత్యా చర్యలు తీసుకుంటామన్నారు. తామంతా మున్సిపాలిటీలో స్వేచ్ఛగా పాలన సాగిస్తున్నామని, ఉద్దేశపూర్వకంగా తమపై బురద చల్లే విధంగా కొన్ని పత్రికలు రాయడంపై తీవ్ర అసహనం వ్యక్తం చేశారు. పట్టణంలో ప్లాస్టిక్ కవర్ల నిషేధానికి పటిష్ట చర్యలు తీసుకుంటున్నట్లు చైర్మన్ గఫార్ తెలిపారు. పట్టణంలోని కాశిరెడ్డి కాలనీలో తాత్కాలికంగా గ్రావెల్స్ రోడ్ల నిర్మాణానికి తక్షణ చర్యలు తీసుకుంటామన్నారు. గతంలో టెండర్లు వేసి ప్రారంభించని రోడ్లను వారంలోగా ప్రారంభించేలా కాంట్రాక్టర్లతో మాట్లాడి చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారు. కుక్కల బెడద నివారణకు శానిటరీ అధికారులకు ఆదేశాలిచ్చామని, వారం రోజుల్లో కుక్కల పట్టివేత చేపడతామని అన్నారు. మున్సిపాలిటీపై కావాలని కొందరు కాంట్రాక్టర్లు దుష్ప్రచారం చేస్తున్నారని అన్నారు. 14వ ఆర్థిక సంఘ నిధులతో పనులకు సంబంధించిన బిల్లులు చేశామని, ఇప్పటి వరకు 15వ ఆర్థిక సంఘ నిధుల్లో చేసిన పనులకు కూడా బిల్లులు చేశామని వివరించారు. గతంలో చేసిన పనులకు సంబంధించిన డిపాజిట్ల నగదును కూడా కాంట్రాక్టర్లకు చెల్లించేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. తొలుత అజెండాలోని అంశాలను ఆర్ఐ అర్జున్‌రావు చదివారు. సమావేశంలో మున్సిపల్ కమిషనర్ నారాయణరావు, కౌన్సిలర్లు, కో ఆప్షన్ సభ్యులు, మున్సిపల్ అధికారులు పాల్గొన్నారు.

పలు సమస్యలపై వినతులు...

వైస్ చైర్మన్ పులి శాంతి మాట్లాడుతూ ప్లాస్టిక్ నిషేధంపై పకడ్బందీగా చర్యలకు అవగాహన ర్యాలీలు, సదస్సులను వార్డుల వారీగా నిర్వహించాలని, మోడల్ స్కూల్ రోడ్డు నిర్మించేందుకు చర్యలు తీసుకోవాలని కోరారు. వైస్ చైర్మన్ మాణిక్యరావు మాట్లాడుతూ టెండర్లు వేసి ప్రారంభించని పనులను త్వరగా ప్రారంభించేందుకు చర్యలు తీసుకోవాలని కోరారు. కౌన్సిలర్ శ్రీరాం సతీష్ మాట్లాడుతూ కాశిరెడ్డినగర్ ఎస్టీకాలనీలో తక్షణ చర్యలుగా రోడ్లు వేయించాలని విన్నవించారు.

పశువులకు ఇంటి వద్దకే ఆరోగ్య సేవలు



పశు ఆరోగ్యసేవ వాహనాన్ని ప్రారంభిస్తున్న అశోక్‌బాబు, జేడీ బేబీరాణి

టంగుటూరు: మూగజీవాలకు ఇంటి దగ్గరే మెరుగైన వైద్యం అందుతోందని వైఎస్సార్ సీపీ కొండపి నియోజకవర్గ ఇన్‌చార్జి వరికూటి అశోక్‌బాబు పేర్కొన్నారు. స్థానిక పశుసంవర్ధక శాఖ ఏడీ కార్యాలయంలో ఇన్‌చార్జి వరికూటి అశోక్‌బాబు, పశుసంవర్ధక శాఖ జేడీ బేబీరాణితో కలిసి వైఎస్సార్ సంచార పశు ఆరోగ్య సేవల వాహనాన్ని మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా అశోక్‌బాబు మాట్లాడుతూ.. పశువులకు మెరుగైన సేవలందించాలనే లక్ష్యంతో ప్రభుత్వం ప్రత్యేక అంబులెన్స్‌లు ఏర్పాటు చేసిందన్నారు. 1962కు ఫోన్ చేస్తే చాలు అంబులెన్సులు రైతుల ఇళ్ల ముంగిటకు వెళ్లి సేవలందిస్తాయన్నారు. జేడీ బేబీరాణి మాట్లాడుతూ.. ఈ అంబులెన్స్‌లో అన్ని రకాల వ్యాక్సిన్లు, మందులతోపాటు పశువులను వాహనంలోకి ఎక్కించేందుకు హైడ్రాలిక్ సౌకర్యం ఉందన్నారు. ఇందులో ఒక పశువైద్యుడు, వెటర్నరీ సహాకుడు, డ్రైవర్, అటెండర్ ఉంటారని తెలిపారు. కార్యక్రమంలో పశుసంవర్ధక శాఖ కొణిజేడు, సూరారెడ్డిపాలెం, ఎం.నిడమానూరు పశువైద్యాధికారులు అనీల్, విజయమాధవి, ధనలక్ష్మి, బ్రహ్మయ్య, ఏఎంసీ మాజీ వైస్ చైర్మన్ చింతపల్లి హరిబాబు, బీసీడి ఉదయకుమార్, మక్కెన వెంకయ్య, పేరూరి కమలాకర్, మన్నం వెంకయ్య, ఉప్పలపాటి సుబ్బారావు, సొసైటీ డైరెకర్ కొమ్ము సురేంద్ర పాల్గొన్నారు.

చిన్నారుల హాజరు శాతం పెంచేందుకు కృషి చేయాలి



బాలామృతం ప్రాముఖ్యతను వివరిస్తున్న సూపర్‌వైజర్ పార్వతి

సీఎస్ పురం: అంగన్‌వాడీ కేంద్రాల్లో చిన్నారుల హాజరు శాతం పెంచేందుకు అంగన్‌వాడీ కార్యకర్తలు, మహిళా పోలీసులు కృషి చేయాలని మండల ప్రత్యేక అధికారి విద్యాసాగర్ సూచించారు. స్థానిక వెలుగు కార్యాలయంలో అంగన్‌వాడీ కార్యకర్తలు, మహిళా పోలీసులతో మంగళవారం సమావేశం నిర్వహించారు. కేంద్రాల నిర్వహణ, మహిళా పోలీసుల పర్యవేక్షణపై సమీక్షించారు. అంగన్‌వాడీ కార్యకర్తలు, మహిళా పోలీసులు సమన్వయంతో పనిచేసి ప్రీ స్కూల్ పిల్లల హాజరు 95 శాతం ఉండేలా చర్యలు చేపట్టాలన్నారు. అంగన్‌వాడీ కార్యకర్తలు తమకు సహకరించడం లేదని, కేంద్రాల్లో జరిగే కార్యక్రమాలపై సమాచారం ఇవ్వడం లేదని, ఈ కారణంగా తాము కేంద్రాలను విజిట్ చేయలేకపోతున్నామని మహిళా పోలీసులు తెలిపారు. ఐసీడీఎస్ సూపర్‌వైజర్ పార్వతి మాట్లాడుతూ వైఎస్సార్ సంపూర్ణ పోషణ ద్వారా అందిస్తున్న బాలామృతాన్ని సద్వినియోగం చేసుకునేలా గర్భిణులు, బాలింతలకు అవగాహన కల్పించాలన్నారు. కేంద్రాలకు వచ్చే పిల్లలకు ఉదయం గుడ్డు, సాయంత్రం పాలు అందించాలన్నారు. లోప పోషణ పిల్లలను గుర్తించి వారిపై ప్రత్యేక శ్రద్ధ చూపించాలన్నారు. కేంద్రాల నిర్వహణలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఎంపీడీవో ఈశ్వరమ్మ, ప్రతం ఎడ్యుకేషన్ ఫౌండేషన్ జిల్లా కో ఆర్డినేటర్ వెంకట్రావు, అంగన్‌వాడీ కార్యకర్తలు, మహిళా పోలీసులు పాల్గొన్నారు.

కుష్టు వ్యాధిపై అవగాహన కల్పించాలి

గుడ్లూరు: గ్రామాల్లో కుష్టు వ్యాధిపై వైద్య సిబ్బంది, ఆశా కార్యకర్తలు ప్రజలకు అవగాహన కల్పించాలని వైద్యాధికారిణి సాయి ప్రియాంక అన్నారు. మండలంలోని చేవూరు గ్రామ సచివాలయంలో జాతీయ కుష్టు వ్యాధి నిర్మూలనపై మంగళవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. సాయి ప్రియాంక మాట్లాడుతూ లెప్రసీపై సర్వేలో భాగంగా వైద్య సిబ్బంది, ఆశ కార్యకర్తలు ప్రతి ఇంటికీ తిరిగి శరీరంపై రాగి మచ్చలు, స్పర్శ లేని మచ్చలు ఉన్న వారిని గుర్తించి వైద్యశాలకు పంపించాలని సూచించారు. ఈ సర్వే కార్యక్రమం ఫిబ్రవరి 13వ తేదీ వరకు మండలంలోని 16 సచివాలయాల్లో మండల వైద్యాధికారి మారుతీరావు పర్యవేక్షణలో జరుగుతుందన్నారు. లెప్రసీ నివారణకు కృషి చేస్తామని వైద్య సిబ్బంది చేత సాయి ప్రియాంక ప్రతిజ్ఞ చేయించారు.

పశువ్యాధులపై తక్షణమే స్పందించాలి

కనిగిరి రూరల్: పశువులు, మూగ జీవాలకు సోకే వ్యాధులపై తక్షణమే స్పందించి వైద్యులను సంప్రదించాలని ఏడీఏ డాక్టర్ సత్యన్నారాయణ సూచించారు. పశుసంరక్షణ వారోత్సవాల్లో భాగంగా మంగళవారం నిర్వహించిన సదస్సులో ఆయన పాల్గొని మాట్లాడారు. అనంతరం మోడల్ స్కూల్ విద్యార్థులకు పలు పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో డాక్టర్ చాంద్‌బాషా, పశువైద్యశాఖ సిబ్బంది పాల్గొన్నారు.

పొగాకులో క్యూరింగ్, గ్రేడింగ్‌లపై అవగాహన సదస్సు

వలేటివారిపాలెం: పక్వానికి వచ్చిన పొగాకు ఆకులు రెలిచి క్యూరింగ్ చేయడంతో నాణ్యమైన దిగుబడులు పొందవచ్చని పొగాకు రైతులకు కందుకూరు రెండో వేలం కేంద్ర నిర్వహణాధికారి కే రాజగోపాల్ సూచించారు. మండలంలోని శాఖవారం గ్రామంలో మంగళవారం పొగాకు రైతులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్యూరింగ్ రీడర్స్ గ్రేడింగ్ సమయాల్లో పొగాకులో అన్ని పదార్థాలు కలవకుండా చూసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఐటీసీ మేనేజర్ సునీల్, బీపీఐ ప్రతినిధి ఉన్నం శ్రీనివాసరావు పొగాకు రైతులు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఉగాది నాటికి జగనన్న ఇళ్ల ప్రారంభం

కందుకూరు అర్బన్: కందుకూరు మున్సిపాలిటీ పరిధిలోని జగనన్న కాలనీలోని ఇళ్లను ఉగాది నాటికి ప్రారంభానికి సిద్ధం చేయాలని కమిషనర్ ఎస్.మనోహర్ అధికారులను ఆదేశించారు. జగనన్న ఇళ్ల నిర్మాణాలపై హౌసింగ్ సిబ్బందితో, సెక్రటరీలతో మంగళవారం సమావేశం మున్సిపల్ కార్యాలయంలో నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ మహదేవపురం, దివివారిపాలెం, ఆనందపురం, కొండికందుకూరు, దూబగుంట, వరాల సాయినగర్ లేఅవుట్‌ల్లో ఉన్న ఇళ్లను పూర్తి చేసి ప్రారంభానికి సిద్ధం చేయాలని సూచించారు.

రోడ్డు ప్రమాదాల ప్రాంతాల పరిశీలన

కందుకూరు అర్బన్: కందుకూరు పట్టణంలో రోడ్డు ప్రమాదాల నివారణకు అధికారులు చర్యలు చేపట్టారు. పట్టణంలో అత్యధిక రోడ్డు ప్రమాదాలు జరుగుతున్న ప్రాంతాలను మంగళవారం కమిషనర్ ఎస్.మనోహర్, మోటారు వాహన తనిఖీ అధికారి మహమ్మద్ రఫీ, సీఐ వెంకట్రావు పరిశీలించారు. ముఖ్యంగా ఓవీరోడ్డులోని మహదేవపురం జంక్షన్ నుంచి జిల్లా పరిషత్ బాలిక పాఠశాల మధ్యలోని ప్రమాదాలు జరిగే ప్రాంతాలను గుర్తించారని, ఈ నివేదిక కలెక్టర్‌కు అందజేయనున్నట్లు కమిషనర్ తెలిపారు. వారి ఆదేశాల మేరకు ప్రమాదాల నివారణకు చర్యలు తీసుకుంటామని కమిషనర్ పేర్కొన్నారు.

నూరు శాతం హాజరు తప్పనిసరి

జరుగుమల్లి(సింగరాయకొండ): మండలంలోని అన్ని గ్రామ సచివాలయాల్లో సిబ్బంది హాజరు నూరు శాతం నమోదు కావాలని ఎంపీడీఓ పి.రామకృష్ణ సూచించారు. జరుగుమల్లి మండలంలోని పాలేటిపాడు గ్రామ సచివాలయాన్ని మంగళవారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఎంపీడీఓ రామకృష్ణ మాట్లాడుతూ.. పాలేటిపాడు గ్రామ సచివాలయ సిబ్బంది హాజరు సక్రమంగా లేదని ప్రజల నుంచి ఇటీవల ఫిర్యాదులు వచ్చాయన్నారు. తన తనిఖీలో ఈ వారం ఇన్‌టైమ్‌లో 90 శాతం హాజరు నమోదు కాగా, అవుట్ టైమ్‌లో 76 శాతం మాత్రమే నమోదైందన్నారు. రెండుసార్లు నూరు శాతం హాజరు నమోదు కాకపోతే శాఖాపరమైన చర్యలు తప్పవని సిబ్బందిని హెచ్చరించారు. ప్రజలకు అందించే సేవల ద్వారా ఆదాయం బాగానే వస్తోందన్నారు.

జాతీయ స్థాయి క్రీడలకు సీతారాంపురం విద్యార్థిని

హనుమంతునిపాడు: సీతారాంపురం జెడ్పీ హైస్కూల్లో 8వ తరగతి చదువుతున్న విద్యార్థిని జల్దీ లాస్యప్రియ జాతీయ స్థాయిలో నిర్వహించే అండర్–14 త్రోబాల్ పోటీలకు ఎంపికైనట్లు పీడీ షేక్ జిలానీబాషా, హెచ్ఎం సుబ్రహ్మణ్యం తెలిపారు. ఈ నెల 28 నుంచి 30వ తేదీ వరకు నంద్యాలలో ఎస్‌జీఎఫ్ పాఠశాల ఆవరణలో నిర్వహించిన అండర్–14 త్రోబాల్ పోటీల్లో ఆడి జాతీయ పోటీలకు ఎంపికైనట్లు తెలియజేస్తూ అభినందించారు.

సబ్సిడీపై చాప్ కట్టర్ అందజేత

వెలిగండ్ల: రైతులకు సబ్సిడీపై ప్రభుత్వం అందిస్తున్న చాప్ కట్టర్‌ను సద్వినియోగం చేసుకోవాలని ఎంపీటీసీ జనార్దన్‌రెడ్డి, వైఎస్సార్ సీపీ నాయకుడు చిలకల నారాయణరెడ్డి సూచించారు. మండలంలోని హుస్సేన్‌పురం ఆర్బీకేలో 40 శాతం సబ్సిడీపై చాప్ కట్టర్‌ను నరసమాంబాపురం రైతు మాదిరెడ్డి వెంకటేశ్వర్లుకు మంగళవారం అందజేశారు. చాప్ కట్టర్ మొత్తం ధర రూ.33,970 కాగా, ప్రభుత్వం అందిస్తున్న సబ్సిడీ రూ.13,588 అని పశుసంవర్ధక శాఖ సహాయకుడు షేక్.యాసిన్‌బాషా తెలిపారు.

ప్రజలకు మెరుగైన సేవలందించాలి



రికార్డులు పరిశీలిస్తున్న ఒంగోలు డీఎస్పీ నాగరాజు

టంగుటూరు: ప్రజలకు మెరుగైన సేవలందించాలని డీఎస్పీ యు.నాగరాజు పోలీస్ అధికారులు, సిబ్బందిని ఆదేశించారు. స్థానిక పోలీసు స్టేషన్‌ను మంగళవారం ఆయన తనిఖీ చేశారు. దర్యాప్తులో ఉన్న సీడీ ఫైల్స్, రికార్డులు పరిశీలించారు. యుఐ కేసుల్లో మంచి పురోగతి సాధించి, పెండింగ్‌లో ఉన్న కేసులను తగ్గించడంలో జిల్లాలోని అన్ని పోలీసు స్టేషన్ల కంటే మెరుగైన ప్రతిభ కనబరిచిన టంగుటూరు ఎస్సై ఖాదర్‌బాషాను అభినందించారు.

బైక్ ప్రమాదంలో ఒకరికి తీవ్రగాయాలు

వెలిగండ్ల: మండల పరిధిలోని పద్మాపురం మలుపు వద్ద మంగళవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరికి తీవ్ర గాయాలవగా, మరొకరికి స్వల్ప గాయాలయ్యాయి. గొల్లపల్లికి చెందిన చిన నాగయ్య మొగళ్లూరు నుంచి గొల్లపల్లికి బైక్‌పై వెళ్తున్నాడు. తమ్మినేనిపల్లికి చెందిన కర్నాటి వెంకటరెడ్డి కనిగిరి నుంచి తమ్మినేనిపల్లికి బైక్‌పై వస్తున్నాడు. పద్మాపురం మలుపు వద్ద రెండు బైక్‌లు ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో చిననాగయ్య తలకు తీవ్ర గాయమైంది. 108 వాహనం రావడం ఆలస్యం కావడంతో క్షతగాత్రుడు చిననాగయ్యను ఎస్సై మహేష్‌కుమార్ పోలీసు వాహనంలో చికిత్స నిమిత్తం కనిగిరి తరలించారు. మెరుగైన వైద్యం కోసం చిన నాగయ్యను ఒంగోలు తరలించారు.

వారంలోగా ఈ క్రాప్ నమోదు చేయాలి

హనుమంతునిపాడు; రబీ సీజన్‌లో సాగుచేసిన పంటలకు వారం రోజుల్లోగా ఈ క్రాప్ నమోదు పూర్తి చేసి నివేదిక అందజేయాలని కనిగిరి డివిజన్ వ్యవసాయ శాఖ ఏడీఏ ఈ వెంకటరమణ సిబ్బందికి సూచించారు. ఈ క్రాప్ బుకింగ్ చేసిన తర్వాత సూపర్ చెక్ తనిఖీకి వచ్చిన పొలాలను మంగళవారం ఆయన పరిశీలించారు. ఉమ్మనపల్లి, రంగంపేట, సీతారాంపురం గ్రామాల్లో ఫీల్డ్ పరిశీలనలో భాగంగా సర్వే నంబర్లను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా రైతులతో ఆయన మాట్లాడుతూ రైతులు వాస్తవంగా సాగుచేసిన ప్రతి పంటను ఈ క్రాప్ బుకింగ్ చేయించుకోవాలన్నారు. ఈ క్రాప్ బుకింగ్ అయిన తర్వాత తంబు వేసి పంటలను ధ్రువీకరించాలని రైతులకు తెలిపారు. అనంతరం రైతు భరోసా కేంద్రాల సిబ్బందితో మాట్లాడుతూ నాలుగు రోజుల్లో ఈ క్రాప్ బుకింగ్ పూర్తి చేయాలన్నారు. వాస్తవంగా సాగుచేసిన పంటలను పరిశీలించి ఈ క్రాప్ నమోదు చేయాలన్నారు. పంటలు సాగుచేయకుండా ఈ క్రాప్ నమోదు చేసిన వారిపై శాఖాపరమైన చర్యలు తప్పవన్నారు. కార్యక్రమంలో ఏవో బి.సంపత్‌కుమార్, వీఆర్వో సుబ్బయ్య, వ్యవసాయ సహాయకులు రబ్బాని, సంధ్యాని, ఆర్.సుప్రజ రైతులు పాల్గొన్నారు.

గుడ్లూరు: రైతులు సాగు చేసిన ప్రతి పంటను ఈ–పంటలో నమోదు చేయించుకోవాలని మండల వ్యవసాయ అధికారి బి.రవికుమార్ అన్నారు. మండల కేంద్రమైన గుడ్లూరులో సాగులో ఉన్న పత్తి పంట ఈ–పంట నమోదు కార్యక్రమాన్ని ఏఓ మంగళవారం పరిశీలించారు. పత్తి మొక్కలకు పేను బంక ఉండటాన్ని గమనించిన ఏఓ రైతులకు దాని నివారణకు పలు సూచనలు చేశారు. ఎక్టిమాప్రైడ్ 20శాతం ఎస్పీ 2 గ్రాములు లీటరు నీటిలో కలిపి ఆకులపై పిచికారి చేయాలన్నారు. లేదా ఇమిడాక్లోరీప్రైడ్ 75 ఎస్ఎల్ 0.25 ఎంఎల్ లీటరు నీటిలో కలిపి వీటితో పాటు వేపనూనె కలిపి పిచికారి చేస్తే పేనుబంకను సమర్థవంతంగా నివారించవచ్చన్నారు. ఏఓ వెంట వీఏఏ సౌభాగ్యవతి ఉన్నారు.

పార్టీ బలోపేతానికి కృషి చేయాలి



గృహసారథి ఇంట్లో మాట్లాడుతున్న అశోక్‌బాబు

టంగుటూరు: వైఎస్సార్ సీపీ బలోపేతానికి గృహసారథులు కృషి చేయాలని, ప్రజలకు సకాలంలో సంక్షేమ పథకాలు అందుతున్నాయో లేదో తెలుసుకోవాలని ఆ పార్టీ కొండపి నియోజకవర్గ ఇన్‌చార్జి వరికూటి అశోక్‌బాబు సూచించారు. టంగుటూరులోని వాణినగర్‌లో గృహసారథి షేక్ రంజాన్ ఇంట్లో కాఫీ విత్ గృహసారథి కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా అశోక్‌బాబు మాట్లాడుతూ.. క్లసర్లో ఎవరికైనా సమస్యలు ఉంటే త్వరగతిన పరిష్కరించాలని సూచించారు. గృహసారథులకు ప్రభుత్వం ఉచితంగా ఆరోగ్య బీమా అందిస్తున్నట్లు తెలిపారు. వారికి పార్టీ అన్ని విధాల సహాయపడుతుందన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర ఎంబీసీ కార్పొరేషన్ డైరెక్టర్ పుట్టా వెంకట్రావు, బీసీడి ఉదయకుమార్, వైఎస్సార్ టీఎఫ్ అధ్యక్షుడు సూదనగుంట వెంకటస్వామి, ఎంపీటీసీ కొమ్ము ప్రభుదాసు, బొడ్డు రవీంద్ర, దాసరి సుబ్బారావు, కొమ్ము బుజ్జి, దుగ్గిరాల పెరరాజు, తన్నీరు చిన్న వీరనారాయణ, కసుకుర్తి శ్రీనివాసరావు, బిల్లా అనీల్, వెల్లన్ శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

అధికారులు ప్రగతి సాధించాలి



మాట్లాడుతున్న మండల ప్రత్యేకాధికారి అర్జున్‌నాయక్

వెలిగండ్ల: అన్నిశాఖల అధికారులు సమన్వయంతో పనిచేసి సంక్షేమం, అభివృద్ధి పనుల్లో ప్రగతి సాధించాలని ఎస్సీ కార్పొరేషన్ ఈడీ, మండల ప్రత్యేక అధికారి అర్జున్‌నాయక్ కోరారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో అన్ని శాఖల అధికారులతో ఎంపీడీవో టి.సుకుమార్ అధ్యక్షతన మంగళవారం సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి వారం జరిగిన పనులు, సంక్షేమ పథకాల అమలు తీరుపై సమీక్ష నిర్వహిస్తామన్నారు. అధికారులు చిత్తశుద్ధితో పనిచేసి ప్రభుత్వానికి మంచి పేరు తేవాలన్నారు. జగనన్న కాలనీల్లో గృహ నిర్మాణాలను త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. అంగన్‌వాడీ భవనాలు, సచివాలయాలు, మిల్క్ సెంటర్లు, ఆర్‌బీకేలు, ప్రభుత్వ పాఠశాలల్లో అదనపు గదుల నిర్మాణాలను త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. పొదుపు మహిళలకు బ్యాంక్‌ల ద్వారా రుణాలు ఇప్పించాలన్నారు. గ్రామ సచివాలయాలపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో టి.సుకుమార్, తహసీల్దార్ నాగార్జునరెడ్డి, ఎంఈవో దాసు ప్రసాద్, ఏఈలు పవన్‌కుమార్, మరియబాబు, ఏవో రంగకృష్ణ, ఏపీఎం లక్ష్మీనారాయణ, టీఏ మనోహర్ పాల్గొన్నారు.

వెటర్నరీ అంబులెన్స్ కేటాయింపుపై హర్షం



సీఎస్ పురం పశువైద్యశాల వద్ద ఉన్న వెటర్నరీ అంబులెన్స్

సీఎస్ పురం: మూగజీవాలకు మెరుగైన వైద్యసేవలు అందించే లక్ష్యంతో వైఎస్సార్ సంచార పశు ఆరోగ్య సేవ (వెటర్నరీ) అంబులెన్స్‌ను సీఎస్ పురం మండలానికి ప్రభుత్వం కేటాయించడంపై మండలంలోని పశుపోషకులు హర్షం వ్యక్తం చేశారు. మండలంలో 65 వేల గొర్రెలు, 19 వేల మేకలు, 25 వేల గేదెలు, 3 వేలకుపైగా ఆవులు ఉన్నాయి. మారుమూల ప్రాంతం కావడంతో ప్రభుత్వం రెండో విడతలో నియోజకవర్గానికి పంపించిన వైఎస్సార్ సంచార పశు ఆరోగ్య సేవ అంబులెన్స్‌ను అధికారులు సీఎస్ పురం మండలానికి కేటాయించారు. దీంతో జనవరి 26వ తేదీ స్థానిక పశువైద్యశాల వద్దకు ఈ అంబులెన్స్ చేరింది. అంబులెన్స్‌లో పశువైద్యుడు, వెటర్నరీ డిప్లమా సహాయకుడు, డ్రైవర్ కం అటెండర్ ఉంటారు. తమ పశువులకు సకాలంలో వైద్య సేవలు అందించే ఏర్పాట్లు చేయడంతో మండలంలోని పశుపోషకులు హర్షం వెలిబుచ్చుతున్నారు.

ఉపాధి హామీ నిధులు స్వాహా

- రూ.9.13 లక్షలు స్వాహా అయినట్లు సామాజిక తనిఖీలో వెల్లడి



రికార్డులు పరిశీలిస్తున్న డ్వామా పీడీ శీనారెడ్డి

హనుమంతునిపాడు: జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం నిధులలో 2021–22లో నిర్వహించిన పనులకు సంబంధించి రూ.9.13 లక్షలు స్వాహా అయినట్లు సామాజిక తనిఖీలో తేలింది. మంగళవారం స్థానిక ఎంపీడీవో కార్యాలయం వద్ద నిర్వహించిన సామాజిక తనిఖీ ప్రజావేదికలో ఆ వివరాలు వెల్లడించారు. 2021–22 ఆర్థిక సంవత్సరంలో మండలంలోని 14 సచివాలయాల పరిధిలో ఉపాధి పనులు, పంచాయతీ పనులు, సచివాలయాలు, రైతు భరోసా కేంద్రాలు, ఆరోగ్య సెంటర్ల నిర్మాణం, పండ్ల తోటల పెంపకం, సోషల్ ఫారెస్టు, మొక్కల పెంపకం పనులను రూ.11.30 కోట్లతో నిర్వహించారు. వాటిపై గత వారం నుంచి సామాజిక తనిఖీ టీంలు తనిఖీలు నిర్వహించి నివేదికలు తయారు చేశారు. ఎంపీపీ గాయం సావిత్రి అధ్యక్షతన ప్రజావేదిక నిర్వహించి పంచాయతీల వారీగా నివేదికను పరిశీలించారు. అనంతరం జరిగిన సమావేశంలో డ్వామా పీడీ శీనారెడ్డి మాట్లాడుతూ స్వాహా అయిన రూ.9.13 లక్షలను సంబంధిత అధికారులు, నిర్వాహకుల నుంచి తప్పనిసరిగా రికవరీ చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో ఎంపీడీవో జీవీ కృష్ణారావు, ఎస్‌ఆర్‌పీ మాధవరావు, జిల్లా విజిలెన్స్ అధికారి వెంకటస్వామి, అంబుడ్స్‌మెన్ షేక్ మీరావలి, వైస్ ఎంపీపీ కె.బెంజి, మాజీ ఎంపీపీ గాయం బలరామిరెడ్డి పాల్గొన్నారు.

దేవస్థాన భూములు ఆక్రమిస్తే కఠిన చర్యలు



దేవస్థాన భూములను పరిశీలిస్తున్న ఎండోమెంట్ ఏసీ గ్రంధి మాధవి

పామూరు: దేవస్థాన భూములు ఆక్రమిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని జిల్లా ఎండోమెంట్ అసిస్టెంట్ కమిషనర్ గ్రంధి మాధవి హెచ్చరించారు. పామూరులోని విరువూరు రోడ్డులో శ్రీమదన వేణుగోపాల స్వామి, వల్లీసమేత భుజంగేశ్వరస్వామి దేవస్థానాలకు చెందిన భూములు ఆక్రమణకు గురవుతున్నట్లు అందిన సమాచారం మేరకు మంగళవారం ఆ భూములను ఆమె పరిశీలించారు. సర్వేనంబర్ 257/2లో గల 1.26 ఎకరాల స్థలాన్ని కొందరు చదునుచేసి ఉండటాన్ని గమనించిన ఆమె.. ఈ భూమి దేవస్థానానికి చెందినదని, తమదనే వారు ఎవరైనా ఉంటే.. దానికి సంబంధించిన ఆధారాలతో అధికారుల దృష్టికి తీసుకురావాలని సూచించారు. దేవస్థానానికి సంబంధించిన ప్రతి భూమిలో బోర్డులు ఏర్పాటు చేస్తామని, అవసరమైనచోట ఫెన్సింగ్ వేస్తామని తెలిపారు. కార్యక్రమంలో వేణుగోపాల, భుజంగేశ్వర ఆలయాల ఈవో వెలగం శ్రీనివాస్, యోగి, యుగంధర్, దేవస్థాన పాలకమండలి సభ్యులు పాల్గొన్నారు.

భైరవకోన హుండీల ఆదాయం రూ.2.90 లక్షలు

సీఎస్ పురం: హుండీల ద్వారా ప్రముఖ పుణ్యక్షేత్రమైన భైరవకోన ఆలయానికి రూ.2,90,701 ఆదాయం వచ్చినట్లు ఆలయ కార్యనిర్వహణాధికారి నర్రా నారాయణరెడ్డి, ఆలయ ట్రస్టు బోర్డు చైర్మన్ సిద్దు రమణారెడ్డి తెలిపారు. దేవదాయ ధర్మాదాయ శాఖ కందుకూరు ఇన్‌స్పెక్టర్ జీఏ సత్యనారాయణ ఆధ్వర్యంలో మంగళవారం భైరవకోనలో హుండీల ఆదాయాన్ని లెక్కించారు.